క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యవతి

బేస్తవారిపేట: హెచ్ఐవీ వైరస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కేజీబీవీ ప్రిన్సిపాల్ సత్యవతి అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీ కళాశాలలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో హాండ్స్ ఆఫ్ కంపాషన్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, సుఖ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. ప్రాజెక్ట్ మేనేజర్ కటికల విజయకుమారి మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ ఎలా సోకుతుంది, సోకకుండా ఎలాంటి జాగ్రత్త పడాలి, వ్యాధి సోకితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం విజయ, హెచ్‌టీసీ సిబ్బంది శ్రావణి, ప్రసన్న, విజయ, హసీనా, విజయకుమారి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఫోన్ ద్వారా వారి సమస్యలు తెలియజేస్తే వాటిని సత్వరమే పరిష్కరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 99592 25702 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

వినూత్న ఆలోచనలతో ఉద్యోగాలు



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

మార్కాపురం: విద్యార్థులు ఉద్యోగం సాధించాలంటే వినూత్నంగా ఆలోచించాలని ఫిజియాలజిస్ట్, మోటివేటర్ డాక్టర్ త్రివేది వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య అధ్యక్షతన లీడర్‌షిప్, ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ లైఫ్ స్కిల్స్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రంగనాయకులు, ఏఓ బి.ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పీవీ అనీల్‌కుమార్, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

దర్గాలో మంత్రులు, ఎమ్మెల్యేల పూజలు



దర్గా వద్ద మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువులో హజరత్ ఖాశీం స్వామి దర్గాలో మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, ఎంఎం కొండయ్య, ఇన్‌చార్జిలు ఎరిక్షన్‌బాబు, గొట్టిపాటి లక్ష్మి, దామచర్ల సత్య మంగళవారం మొక్కులు చెల్లించారు. వారి వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రావి భాషాపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు చిన్నపురెడ్డి తదితరులు ఉన్నారు.

కోలాహలంగా ప్రతిష్ఠ మహోత్సవాలు



కలశ పూజలో విగ్రహమూర్తులు

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో పోలేరమ్మతల్లి, పోతురాజు స్వామి విగ్రహ, శిఖర, కలశ, ఆదిత్య నవగ్రహ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం వేదపండితులు పోతులూరి శివరామాచార్య ఆధ్వర్యంలో రుద్ర హోమాలు, క్షీరాధివాసం, సహస్రనామ తదితర పూజలు చేశారు. కలశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు వ్యవహరించారు. బుధవారం అమ్మవారి విగ్రహ పతిష్ఠ, కలశ, శిఖర, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు అన్న సంతర్పణ చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

దాడులు చేసినవారి మీద రౌడీ షీట్ ఓపెన్ చేయాలి



మహిళా వైద్యులపై అసభ్యంగా ప్రవర్తించడం, దాడులు చేయడాన్ని తీవ్రమైన నేరాలుగా పరిగణించి వారిమీద రౌడీషీట్ ఓపెన్ చేయాలి. అంతకంటే ముందు మద్యం తాగి వచ్చే రోగులను వైద్యశాలలోకి అనుమతించకుండా నిరోధించాలి. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి. ఆస్పత్రిలో అన్నీ ప్రధాన పాయింట్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టాలి. వైద్యశాల ఆవరణలో మహిళా వైద్యులకు, చికిత్స కోసం వచ్చే మహిళా రోగులకు భద్రతాపరమైన వాతావరణం కనిపించేలా చర్యలు తీసుకోవాలి. వైద్యుల మీద దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించినప్పుడే మరొకరు అలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉంటారు.

– డా.సమీర్ శర్మ షేక్, త్రోవగుంట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, ఒంగోలు

నేరస్తులనే పట్టుకోలేదు..ఇక శిక్షలు ఎప్పుడు వేస్తారు



కోల్‌కత్తా ఘటనతో దేశంలోని మహిళలకు రక్షణ లేదన్న నిజం మరోసారి రుజువైంది. నిర్భయ, దిశ ఘటనలు జరిగినప్పటికీ నేరస్తులకు సరైన శిక్షలు పడలేదు. ఇప్పుడు కూడా జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం జరిగి రోజులు గడుస్తున్నా నేరస్తులను పట్టుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. నేరస్తులనే పట్టుకోలేని వారు ఇక వారిని ఎలా శిక్షిస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. ప్రతి విషయాన్ని రాజకీయం చేసినట్టే ఈ హత్యాచారాన్ని కూడా రాజకీయం చేయడం బాధాకరం. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రభావాలకు గురికాకుండా నేరస్తులను విచారించాలి. కఠినంగా శిక్షించాలి. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినాతికఠినమైన చట్టాలు చేయాలి.

– డా.లియూ హల్లన్, సీఏఎస్, మాతా శిశు వైద్యశాల, ఒంగోలు



పెద్దారవీడు మండల కార్యాలయం వద్ద తారు రోడ్డుపై లోతైన గుంత



బద్వీడుచెర్లోపల్లి గ్రామం సమీపంలో బ్రహ్మంగారి దేవాలయం వద్ద రోడ్డుపై గుంత

ఆ రోడ్లపై ప్రయాణం నరకమే!

పెద్దారవీడు: రోడ్డుపై ప్రయాణం చేయాలంటే చిన్న చిన్న వాహనాలే కాకుండా పెద్ద వాహనాల డ్రైవర్లు సైతం భయపడి పోతున్నారు. మండల కేంద్రం పెద్దారవీడు మండల కార్యాలయం వద్ద, బద్వీడుచెర్లోపల్లి గ్రామం సమీపంలో బ్రహ్మంగారి దేవాలయం వద్ద గుంతలు ఉన్నాయి. ఈ రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో తారు, కంకర లేచి గుంతలు ఏర్పడ్డాయి. ఆ రోడ్డుపై కర్నూలు, శ్రీశైలం, ఒంగోలు, కడప తదితర జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయం భయంగా ఉంటోందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే వర్షం నీరు నిల్వ ఉండటంతో ఏ గుంత ఎంత లోతు ఉందో కూడా తెలియక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే గుంత ఎక్కడ ఉందో అర్థంగాక ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని అందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అధికారులు ఈ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నా వారికి గుంతులు కనడటం లేదా అని వాహనాదారులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా పెద్దారవీడు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర రోడ్డుకు మార్జిన్ పక్కల మట్టి ఎత్తుగా పోయడంతో నడి రోడ్డుపై వర్షం నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎర్కొంటున్నారు. తారు రోడ్డుపై రెండు లేక మూడు రోజుల పాటు వర్షం నీరు నిల్వ ఉండటంతో మురుగు నీరుగా తయ్యారవుతుంది. దీంతో దుర్వాసనతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇంత జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించక పోవడంపై పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షిత నీటికి రక్షణ కరువు



పైపులైను నుంచి లీకైన నీరు



లీకైన నీటిలో సేద తీరుతున్న కుక్కలు

- నీరు లీకైన ప్రాంతాల్లో కుక్కలు, పందుల వడక
- ఆ నీరే తిరిగి పైపుల్లోకి ఇంకుతున్నా పట్టించుకోని కాంట్రాక్టర్

కురిచేడు: ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. నాగార్జున సాగర్ కాలువ నుంచి చెరువులకు, ఆపై ఫిల్టర్ బెడ్లలో వాటిని శుద్ధి చేసి తిరిగి గ్రామాలకు నీరు సరఫరా చేస్తున్నారు. ఆ నీరు స్థానిక నాగార్జున సాగర్ కుడి కాలువ దర్శి బ్రాంచి కాలువ పక్కన దర్శి రోడ్, ఎన్ఎస్‌పీ అగ్రహారం రోడ్ కూడలిలో పైపునకు లీకు ఏర్పడింది. ఆ లీకు నీరు నీరు సరఫరా జరిగే సమయంలో పైకి వచ్చి నిల్వ చేరుతున్నాయి. ఆ నీటిలో కుక్కలు, పందులు సేద తీరుతున్నాయి. పొలాలకు వచ్చి పోయే గేదెలు ఆ నీటి నుంచి వచ్చి వెళ్తుంటాయి. అలాగే దర్శి రోడ్‌లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ ఎదురుగా కూడా నీరు లీకై నిల్వ చేరుతుంది. ఆ నీటిలో పందులు, కుక్కలు సేదతీరుతూ నీటిని కలుషితం చేస్తున్నాయి. కలుషితమైన ఆ నీరు పైపులైనుకు నీటి సరఫరా నిలిచిపోగానే తిరిగి పైపుల్లోకి ఇంకిపోతోంది. తిరిగి నీటి సరఫరా జరిగే సమయంలో రక్షిత నీటితో మురుగునీరు కలిసి గ్రామాలకు వెళ్తున్నాయి. దీంతో తాగునీరు కలుషితమై అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంత జరుగుతున్నా తాగునీరు విడుదల చేసే కాంట్రాక్టరు, సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులైనా పట్టించుకుని లీకులకు మరమ్మతులు చేసి రక్షిత నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్ల మధ్య కొచ్చెర్లకోట–మార్కాపురం రోడ్డు



చిల్లచెట్లతో మూసుకుపోయిన రోడ్డు

దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోట నుంచి మార్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు ఇరువైపులా చిల్ల చెట్లతో మూసుకుపోయింది. దీంతో వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. పాదచారులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్‌లు ఈ రహదారి నుంచి వెళ్లాలంటే చిల్లచెట్లు మూసుకుపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. రాత్రి వేళల్లో ఎదురు ఎదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొచ్చెర్లకోట నుంచి నిత్యం ఆ రోడ్డు రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా రైతులు ఎక్కువ భాగం పొలాలకు వెళ్తుంటారు. ఎన్నోసార్లు చిల్లచెట్లు తొలగించాలని అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని కొచ్చెర్లకోట, సిద్ధాయపాలెం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

బేస్తవారిపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ పద్మావతి అన్నారు. మంగళవారం 'సాక్షి'లో 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో విషజ్వరాలతో వైద్యశాలలకు క్యూ కడుతున్నారని ప్రచురితమవడంతో బేస్తవారిపేట, గలిజేరుగుళ్ల పీహెచ్‌సీలను ఆమె తనిఖీ చేశారు. శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాలను సక్రమంగా పూర్తి స్థాయిలో నిర్వహించాలని, గ్రామాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో పంచాయతీ అధికారులకు చెప్పి ఆయిల్‌బాల్స్ వేయించాలని, గృహాల్లో నీటిని నిల్వ చేసుకునే వాటిని పరిశీలించాలని, ఎబెట్ రసాయనాన్ని పిచికారీ చేయించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీరాజ్, లక్ష్మీజలేందర్, పీహెచ్‌సీ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎస్సై

దర్శి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై ఎం.మురళి సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్స్ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మురళి మాట్లాడుతూ డ్రగ్స్ విషయంలో యువత చిక్కుకున్న విధానాన్ని వివరించారు. మాదక ద్రవ్యాలు తీసుకుంటే వాటికి బానిసలు అయిపోతున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా విద్యార్థులు ఉండాలని చెప్పారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చదువు, భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు చందలూరు పీడీ సోము అంజిరెడ్డి 150 మంది విద్యార్థులకు అందించిన 300 నోటు బుక్స్‌ను ఎస్సై, ప్రిన్స్‌పాల్ చేతుల మీదుగా అందజేశారు. అంజిరెడ్డి దాతృత్వాన్ని వారు కొనియాడారు. కళాశాల ప్రణాళిక అభివృద్ధి సభ్యులు జీవీ రత్నం పాల్గొన్నారు.

వరి కోతల సమయంలో మెళకువలు పాటించాలి



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ ప్రసాదరావు

తాళ్లూరు (దర్శి): మండలంలో వివిధ దశల్లో బోర్ల కింద ఉన్న వరి కోతల సమయంలో మెళకువలు పాటిస్తే ధాన్యం ఎక్కువగా ఇంటికి తీసుకెళ్లవచ్చని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు సూచించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా వరి పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ వరి పొలాలు 30 శాతం కోత దశకు వచ్చాయని, వెన్నులోని 80 శాతం గింజలు పక్వానికి వచ్చిన తర్వాత కాండం పచ్చగా ఉన్నప్పుడే కోత కోయడం మంచిదన్నారు. కోతకు పూత దశ నుంచి సుమారు 28 నుంచి 32 రోజుల వ్యవధి తీసుకుంటుందన్నారు. ఈ దశల్లో గింజల్లో సుమారు 18 నుంచి 24 శాతం తేమ ఉంటుందని తెలిపారు. మండలంలో 706 ఎకరాల్లో వరి నాటారని, నాటిన వరి వివిధ దశల్లో ఉందని చెప్పారు. వీఏఏ నాగరాజు నాయక్, రైతులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేసుకోవాలి



పంట నమోదు పరిశీలిస్తున్న ఏఓ బాలకృష్ణనాయక్

దర్శి: రైతులు సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని వ్యవసాయాధికారి వడితే బాలకృష్ణ నాయక్ సూచించారు. మండలంలోని పోతవరం, దేవవరం గ్రామాల్లోని పంటలను మంగళవారం ఆయన పరిశీలించి పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను సర్వే నంబర్‌తో సహా నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకుంటే వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే ప్రతి పథకం రైతులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. రైతు సేవా కేంద్రాల ద్వారా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ తీసుకెళ్లి పంట వివరాలు తెలియజేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం వస్తుందన్నారు. పంటల బీమా, రుణాలు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ సహాయకులు రవీంద్ర, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఫోక్సో కేసు నమోదు

ముండ్లమూరు: మండలంలోని గంగనపాలెం గ్రామానికి చెందిన శ్రీరామ్ జాన్ హైడ్ (చెర్రీ) అనే యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వై.నాగరాజు మంగళవారం తెలిపారు. మారెళ్ల గ్రామానికి చెందిన మైనర్‌ను ఏడాది నుంచి మాయమాటలతో నమ్మించి పెళ్లి చేసుకుంటానని మోసం చేయడంతో యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

మార్కాపురం టౌన్: యువత డ్రగ్స్, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్టూడెంట్ యాక్టివిటీ క్లబ్ కోఆర్డినేటర్ ఎం శేషుకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ నిరోధక కమిటీ ఆధ్వర్యంలో ఏకేయూ వీసీ సూచనల మేరకు ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూధన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారతదేశం గొప్ప సంపద యువతేనని, మత్తుపదార్థాలకు బానిసై ఆ గుర్తింపును కోల్పోవద్దని హితవు పలికారు. కన్వీనర్ ఎం.రాఘవేంద్ర మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసైతే విచక్షణ కోల్పోతారని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్ సూచించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష



తాళ్లూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్సై మోహన్‌రావు, పోలీసులు



దొనకొండలో హెల్మెట్‌పై అవగాహన..



ముండ్లమూరు ర్యాలీలో పోలీసులు, వాహనదారులు

తాళ్లూరు (దర్శి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌పై తప్పని సరిగా అవగాహన కలిగి ఉండాలని దర్శి ఎస్సై, తాళ్లూరు ఏఎస్సైలు ఎం.మురళి, జి.మోహన్ రావులు సూచించారు. దర్శి, తాళ్లూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో హెల్మెట్‌లపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మురళి, మోహన్‌రావులు మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తే ఏమైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం ఎక్కువగా ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడంతో జరిగిన మరణాలే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ద్విచక్ర వాహన దారుడు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఇక కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దొనకొండ: ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పని సరిగా ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్ఐ కె.విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డు సర్కిల్లో ద్విచక్ర వాహనదారులకు, ప్రజలకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ముందుగా స్థానిక రైల్వేస్టేషన్ నుంచి బైపాస్ సెంటర్ వరకు ద్విచక్ర వాహనదారులతో పోలీస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వాడటంతో ప్రమాదాలు అరికట్టవచ్చని, ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ పెట్టుకుని ప్రయాణం చేయాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు.

ముండ్లమూరు: వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం ద్వారా ప్రాణానికి రక్షణగా నిలుస్తుందని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం దర్శి–అద్దంకి ప్రధాన రహదారిలో హెల్మెట్ వాహనదారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా అనుకోకుండా కొద్దిపాటి ప్రమాదం జరిగినా ప్రణాలు కాపాడుకోవచ్చన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ఇతర వాహనదారులకు ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి



కార్యక్రమానికి హాజరైన పలువురు అధికారులు

పెద్దదోర్నాల: మండల పరిదిలోని పనుకు మడుగు గిరిజనగూడెంలో మంగళవారం పీఎం జన్మన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి ధనుంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ గిరిజనులకు పక్కా ఇళ్లు, ప్రతి ఇంటికి కుళాయి, ప్రతి ఇంటికి విద్యుత్, అందరికీ నాణ్యమైన విద్య, అందరికీ ఆరోగ్యం తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సౌకర్యాలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. పంచాయితీ కార్యదర్శి మోహనరావు, వెలుగు కో ఆర్డినేటర్ కొండె పోగు మోహన్, ఐటీడీఏ టెక్నికల్ అసిస్టెంట్ లాలా అహ్మద్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: రైతులు సాగు చేసిన పంటను నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండలంలో కంభంపాడు, తంగిరాలపల్లి గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం అమె పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ సాగు చేసిన పంటలను ఇంకా నమోదు చేయించుకోని రైతులు ఉంటే త్వరగా పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. పంట నమోదుతో రైతుకు ఎంతో ఉపయోగాలు ఉంటాయని, త్వరితగతిన రైతులు సాగు చేసిన ప్రతి పంట నమోదు చేయాలని వీఏఏలకు సూచించారు. కంభంపాడులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అందులో భాగంగా కొన్ని మందులను పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించారు. ఆమె వెంట వీఏఏలు వస్తంనాయక్, జిలానీ, రైతులు ఉన్నారు.